క్లుప్తంగా

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి


గుడ్ న్యూస్ క్యాంపును ప్రారంభిస్తున్న రెవరెండ్ సంతోష్ ప్రసన్నరావు

కర్నూలు (టౌన్): బాల్యం నుంచే దేవుని పట్ల భక్తి పెంచుకోవాలని నంద్యాల డయాసిస్ బిషప్ రైట్ రెవరెండ్ సంతోష్ ప్రసన్న రావు సూచించారు. సోమవారం స్థానిక కోల్స్ జూనియర్ కళాశాలలోని సమావేశ హాలులో చైల్డ్ ఏవాంజిలిజమ్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియా కర్నూలు శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల గుడ్ న్యూస్ కాంప్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆయన బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ.. పిల్లల్లో ఆధ్యాత్మికత పెంపొందిస్తే వారు భవిష్యత్తులో భావిభారత పౌరులుగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో బ్యూలా, ఎస్‌టీబీసీ కళాశాల కరెస్పాండెంట్ ఆర్.ఆర్.డి.సజీవరాజు, సీఈఎఫ్ డైరెక్టర్ ప్రభుదాస్, అనీల్‌కుమార్, విజయ్ కుమార్, జోసెఫ్ రావు, నెహెమ్యా, రెవరెండ్ పాల్ ఆగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలనకు పోరాటం


గుర్రం జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): తెలుగుజాతి సాహిత్య దిగ్గజం గుర్రం జాషువా స్ఫూర్తితో అంటరానితనం నిర్మూలనకు పోరాటం చేస్తామని కేవీపీఎస్ నగర కార్యదర్శి ఎం.భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం శ్రీరామనగర్‌లో నవయుగ చక్రవర్తి బిరుదాంకితుడైన విశ్వ నరుడు గుర్రం జాషువా జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాషువా ఆలోచనలు సమాజాన్ని మేల్కొల్పాయని, ఆయన విలువలు, మాటలను నేటి సమాజానికి తెలపాల్సిన బాధ్యత పౌరులపై ఉందన్నారు. కేవీపీఎస్ నాయకులు సురేష్, ఆనంద్, వెంకటేశ్వర్లు, మహేష్, రాజు పాల్గొన్నారు.

జిల్లా వాసికి సాహితీ ప్రతిభా పురస్కారం


హరికిషన్

కర్నూలు కల్చరల్: ఒంగోలుకు చెందిన ప్రముఖ సాహితీ సంస్థ కళామిత్ర మండలి వారు తెలుగు సాహిత్యంలో విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ ఎం.హరికిషన్‌కు 'శ్రీ సీతాదేవి నాగేశ్వరరావు సాహితీ ప్రతిభా పురస్కారం' అందజేయనున్నట్లు ప్రకటించారు. హరికిషన్ సామాజిక సమస్యలపై కథలు రాస్తూ ప్రజలను చైతన్య పరచడంతో పాటు బాల సాహిత్యాన్ని, చరిత్ర పుస్తకాల్ని రచిస్తూ ప్రచారం చేస్తున్నారని సాహితీ సంస్థ కళా మిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మ రావు తెలిపారు. ఒంగోలులోని ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో నవంబర్ 2వ తేదీన ఆయనకు పురస్కారాన్ని అందజేయనున్నట్లు వెల్లడించారు.

జయప్రదం చేయండి


సంఘీభావం తెలుపుతున్న ఫ్యాప్టో అనుబంధ సంఘాల నాయకులు


కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండి వైఖరిని నిరశిస్తూ అక్టోబర్ 7న విజయవాడలో చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు కె.ప్రకాష్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సన్నాహక సమావేశాన్ని ఎస్టీయూ భవనంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఆర్.సేవాలాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివిధ బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా ఉద్యోగులకు సంబంధించి ఆర్థిక పరమైన అంశాలపై ఏ మాత్రం స్పందించడం లేదన్నారు. ఉద్యోగులకు బకాయిలు పడిన 30 వేల కోట్లు తక్షణమే చెల్లించాలని, 12వ పీఆర్‌సీకి తక్షణమే కమిషనర్‌ను నియమించి, ఆ నివేదికను సమర్పించేలోగా, మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. హెల్త్ కార్డుల కోసం ఉద్యోగులు ఏటా రూ.180 కోట్లు చెల్లిస్తున్నప్పటికీ హెల్త్ కార్డులతో హాస్పిటల్‌కు వెళితే చికిత్స చేయడం లేదన్నారు. ఫ్యాప్టో అనుబంధ సంఘాల నాయకులు రవికుమార్, నవీన్ పాటి, గోకారి, జనార్ధన్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ ఏడీకి పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా పనిచేస్తున్న ఎం.నాగరత్నమ్మకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు సోమవారం వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ జీఓ ఆర్‌టి నంబర్ 664 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను పదోన్నతిపై వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో కేఎంసీ ఏడీగా ఎవరినీ నియమించలేదు.


సరస్వతీ.. నమస్తుభ్యం


వీఆర్ కాలనీలో..


గీతా మందిరంలో..



లలితా పీఠంలో..


రాజరాజేశ్వరి ఆలయంలో..


సత్యసాయి మందిరంలో..


వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో..,


కల్లూరు చౌడేశ్వరి దేవి ఆలయంలో..,


పెద్ద అమ్మవారి శాలలో..


నాగలాపురం సుంకులా పరమేశ్వరి ఆలయంలో..


లలితా పీఠంలో నృత్యం చేస్తున్న చిన్నారులు,


రాజరాజేశ్వరి ఆలయంలో నృత్యం చేస్తున్న చిన్నారులు


పూజల్లో ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు


చిన్న అమ్మవారి శాలలో..

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అక్షరాభ్యాసాలు, కన్య పూజలు, మూలా నక్షత్ర పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పంచామృతాభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకీ సేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవరాత్రులపై ప్రవచనాలు జరిగాయి. ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, స్టేట్ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి, ఎస్వీ జనక దత్తారెడ్డి కొత్తపేట ఎస్వీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహం వద్ద పూజల్లో పాల్గొని అన్నాదానం చేశారు.


సప్తగిరి చౌడేశ్వరీ దేవి ఆలయంలో..,


చౌడేశ్వరీ దేవి ఆలయంలో..,


బండిమెట్ట అంబా భవానీ ఆలయంలో..,


ఇ.తాండ్రపాడులో..,


కల్లూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో..,


నిమిషాంబ దేవి ఆలయంలో..,


లలితా పీఠంలో సామూహిక పూజల్లో భక్తులు

మౌలిక వసతులు కల్పించండి


నగర వాసుల నుంచి వినతులు స్వీకరిస్తున్న మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్): నగరంలోని స్టాంటన్‌పురం, శ్రీనివాస కాలనీలో అనధికార లేఔట్ వేసి గ్రావెల్ ఎత్తు తగ్గించడంతో ఆ రహదారి వెంట వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని, రహదారి, మురుగు కాల్వలు నిర్మించాలని కాలనీవాసులు రియాజ్, అమీర్, రాముడు, దాదావలి, భాస్కర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 26 అర్జీలు వచ్చాయని, పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మనోహర్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు సిబ్బంది పాల్గొన్నారు.

విన్నపాలు ఇవే..

- శ్రీరామనగర్, మద్దూరు నగర్‌లో మ్యాన్ హోల్స్‌పై మూతలు ఏర్పాటు చేయాలని స్థానికులు నరసింహులు కోరారు.
- జనార్ధనరావు నగర్‌లో కమ్యూనిటీ హాలు నిర్మించాలని సీపీఐ ప్రతినిధులు నల్లనోన, రామక్రిష్ణ, శ్రీనివాసరావు విన్నవించారు.
- 35వ వార్డు శివప్పనగర్‌లో సీసీ రహదారులు నిర్మించాలని స్థానికులు మదన్, రజనీ, రాముడు వినతిపత్రం ఇచ్చారు.
- 19వ వార్డు సరస్వతి నగర్‌లో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించాలని స్థానికులు ఆనంద రావు కోరారు.
- 34వ వార్డు మహావీర్ కాలనీ పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు నారాయణ రెడ్డి, జంబులయ్య అర్జీ ఇచ్చారు.

సూపరింటెండెంట్‌కు ఘన సన్మానం


డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్): ఉద్యోగ విరమణ చేసిన ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లును సోమవారం స్థానిక కంటి ఆసుపత్రిలో అధికారులు, వైద్యులు, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. కంటి ఆసుపత్రిలో డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ సింధియా శుభప్రద, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పి.చంద్రశేఖర్‌కు సన్మానం

ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటి వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్‌ను ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాయలసీమ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధర్‌రెడ్డి, రాయలసీమ బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ కె.కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతం నుంచి తొలిసారిగా వైస్ చాన్సలర్‌గా డాక్టర్ పి.చంద్రశేఖర్ నియమితులు కావడం గర్వకారణమన్నారు. కార్యదర్శి డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి, ఈఎన్‌టీ వైద్యులు జయప్రకాష్‌రెడ్డి, దంత వైద్యులు ఉపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రద్దీకి తగ్గ బస్సులేవీ?

- దసరా సెలవులతో పెరిగిన రద్దీ
- అదనపు బస్సు సర్వీసులు నడపని అధికారులు


బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

కర్నూలు సిటీ: దసరా పండుగకు అన్ని రకాల విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. దీంతో కర్నూలు జిల్లా కేంద్రం నుంచి దసరా పండుగకు సొంతూర్లకు వెళ్లేందుకు సోమవారం ప్రయాణికులు కొత్త బస్టాండ్‌కు ఎక్కువగా రావడంతో రద్దీగా మారింది. జిల్లాకు చెందిన వారు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో ప్రైవేటు ఉద్యోగాలు చేసుకునేవారు సొంత గ్రామాలకు చేరుకునేందుకు ఏటా దసరా పండుగకు ఏపీఎస్ఆర్‌టీసీ ప్రత్యేక బస్సులను నడిపేది. అయితే ఈ ఏడాది ఎలాంటి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో అధిక శాతం మంది ప్రైవేటు వాహనాల్లోనే సొంతూర్లకు చేరుకుంటున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలు పెట్టి రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎలాంటి అదనపు బస్సులు లేకుండానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు చేయడంతో తీవ్రంగా బస్సుల కొరత వచ్చింది. ఈ కారణంగానే ఈ ఏడాది దసరా పండుగకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయలేదని, హైదరాబాదు, విజయవాడకు మాత్రమే నాలుగైదు బస్సులు అదనంగా తిప్పుతున్నట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. పండుగ పూర్తయ్యాక తిరుగు ప్రయాణానికి బస్సులు లేకపోతే మరిన్ని ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు నేడూ అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 30వ తేదీ దుర్గాష్టమి సందర్భంగా సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లులు కట్టించుకునే కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయని విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు మంగళవారం కూడా బిల్లులు చెల్లించవచ్చని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

కల్లూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్ ఉంటుందని ఆ పార్టీ కల్లూరు మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నటేకూరులో మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెడ్‌బుక్ రాజ్యాంగంలో అన్యాయానికి గురైన కార్యకర్తలకు, సామాన్యుల భరోసా కోసమే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఆరాచకాలు, వేధింపులకు పాల్పడిన వ్యక్తుల వివరాల పేర్లు డిజిటల్ బుక్‌లో నమోదవుతాయన్నారు. కూటమి 15 నెలల పాలనలోనే రైతులు, ప్రజలు రోడ్లు ఎక్కి ధర్నాలు చేస్తున్నారన్నారు. ఉల్లి, టమాట, ఇతర పంటలకు సరైన ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాల అమల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉల్లి పంటకు హెక్టారు రూ. 50 వేలు ఇస్తామని చెప్పారని, దీని వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావని విమర్శించారు.

పేదలకు వైద్య విద్య దూరం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఆయన మంచి పేరు వస్తుందనే అక్కసుతో వాటిని ప్రైవేటు పరం చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు కల్లా వెంకట రమణారెడ్డి, కేశవరెడ్డి, ఈశ్వరయ్య, ఉలిందకొండ రమణారెడ్డి, సుంకన్న, అశోక్ వర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, నారాయణ, రమణ, సర్పంచ్‌లు లక్ష్మన్న, మద్దిలేటి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల భోజనంపై ఫిర్యాదులు


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

కర్నూలు(సెంట్రల్): అన్న క్యాంటీన్లలో భోజనం రుచికరంగా లేదని, సమయానికి తెరవడం లేదని, పారిశుద్ధ్యం బాగోలేదని ఐవీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి పీజీఆర్ఎస్, ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, జీఎస్టీ పన్నుల తగ్గింపుపై కలెక్టర్ మండల ప్రత్యేకాధికారులు, మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నా క్యాంటీన్ల విషయంలో మునిసిపల్ కమిషనర్ల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. వచ్చిన ఫిర్యాదులపై సమీక్షించుకొని పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చేలా చూడాలని ఆదేశించారు. అలాగే కొన్ని ప్రదేశాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫిర్యాదులు వస్తే సంబంధిత సెక్రటేరియట్ సిబ్బందికి నోటీసులు ఇవ్వాలన్నారు. ఫిర్యాదులు రాకుండా వార్డు సెక్రటరీలు చర్యలు తీసుకోవాలని, అందుకోసం ఇంటింటి నుంచి చెత్త సేకరణ, డ్రైయిన్‌లను శుభ్రం చేయించడం నిత్యం జరిగేలా చూడాలని డీపీఓకు సూచించారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలన్నారు. జీఎస్టీ తగ్గింపుపై ముద్రించిన పోస్టర్లు త్వరగా మండలాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్‌తో యువతలో గుండె జబ్బులు


హెల్త్ ప్యాకేజీని ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్


ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ, కిమ్స్ హాస్పిటల్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): యువతలో గుండెజబ్బులు పెరగడానికి తప్పుడు జీవనశైలి, ఒత్తిడి, శారీరక వ్యాయామం లేకపోవడం, జంక్‌ఫుడ్ కారణమని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చెప్పారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని ఆయన సోమవారం మెడికవర్ హాస్పిటల్‌లో ప్రత్యేక గుండె చెకప్ ప్యాకేజీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా హెల్త్ చెకప్స్ చేయించుకోవాలని, త్వరగా గుర్తించడం ద్వారా గుండె సంబంధిత వ్యాధులను నివారించవచ్చన్నారు. క్లస్టర్ హెడ్ వై.మహేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. సోమవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా స్థానిక కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో హార్ట్ వాక్-2025 కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమె ప్రారంభించారు. ఈ వాక్ కిసాన్ ఘాట్ వరకు సాగింది. అనంతరం అక్కడ ఉచిత కార్డియాక్ క్యాంపు నిర్వహించారు. కిమ్స్ సీఓఓ సునీల్ సేపూరి, కార్డియాలజిస్టులు నాగేంద్రప్రసాద్, సందీప్‌కుమార్, అరుణ, ఫరూక్, గోపీనాథ్, నవీన్, సుమంత్ పాల్గొన్నారు.

నగర అభివృద్ధిలో భాగస్వాములవుతాం

కర్నూలు (టౌన్): కర్నూలు నగర అభివృద్ధిలో తమ వంతు సహకారం అందిస్తామని రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ మోహన్‌కుమార్, సీఈఓ గోపీనాథ్, వైస్ చైర్మన్ వంశీనాథ్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక నగరపాలకలో కమిషనర్ పి.విశ్వనాథ్‌ను కలిసి అంగీకార పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా నగర సుందరీకరణ పనుల్లో ముందుంటామని చెప్పారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సూచించారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్యశిబిరం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందన్నారు. తద్వారా సమాజం, దేశం బాగుంటుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇటీవల మహిళలకు బీపీ, షుగర్‌తో పాటు క్యాన్సర్ కేసులు అధికమయ్యాయన్నారు. ముందస్తు పరీక్షలతో వీటిని నివారించుకోవచ్చని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు చేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధీర్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మాధవీశ్యామల తదితరులు పాల్గొన్నారు.